క్లుప్తంగా

తడి పొడి చెత్త సేకరించాలి



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న జ్యోతి

జగిత్యాల: తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కార్మికులను మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ఆదేశించారు. బుధవారం జగిత్యాలలోని డంపింగ్‌యార్డును పరిశీలించారు. పట్టణంలోని వార్డుల్లో సేకరించిన తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించేలా చూడాలన్నారు. తడి, పొడి చెత్తతోవర్మి కంపోస్ట్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానాన్ని పరిశీలించారు. గీత విద్యాలయంలో చెత్త ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతుందని, చర్యలు తీసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ వారు కోరారు. వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఐపీఎస్ అధికారి



కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఐపీఎస్ అధికారి శివ ఉపాధ్యాయ

జగిత్యాలక్రైం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 2021 బ్యాచ్ ఐపీఎస్ శివ ఉపాధ్యాయను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించగా ఆయన జగిత్యాల జిల్లాకు ఎన్నికల నేపథ్యంలో విధుల్లో చేరారు. బుధవారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసుల వివరాలతో పాటు నేరాల పరిశోధనపై వారితో మాట్లాడి తెలుసుకున్నారు. పలు కేసుల రికార్డులను కూడా పరిశీలించారు.

కొనుగోలుదారుడికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలి



ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో దీపిక

ఇబ్రహీంపట్నం: ఎరువులు కొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఏవో దీపిక డీలర్లకు సూచించారు. బుధవారం మండలంలోని యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ధరల పట్టికలు, బిల్లు బుక్కులను పరిశీలించారు. నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని డీలర్లను కోరారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్, డీలర్లు పాల్గొన్నారు.

పాడిగేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి

ఇబ్రహీంపట్నం: పాడిగేదెలకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రాపూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణకు 200 పశువులకు టీకాలు వేశారు. ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అక్తర్, రైతులు దొనికెన భూమ గంగారాం, బంటు గాంధీ, గంగారాం, నడిపి చిన్నయ్య, ఆదిశెట్టి నర్సయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వంటల పోటీలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జంటలకు బుధవారం వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌చారి జంట రాగిజావను తయారు చేసి అందరికీ తాగించారు. మిల్లెట్స్ యొక్క ప్రాముఖ్యతను పోషక ఆహార పద్ధతులను, రక్తహీనత గురించి వివరించారు. అలాగే మండలంలోని వర్షకొండ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక పదార్థాలపై గర్భిణులు, బాలింతలు వివరించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రతిభ, శోభ, హెల్త్ సూపర్‌వైజర్లు హేమలత, ఉష, పంచాయతీ కార్యదర్శి రాకేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వంతెనపై బీటీరోడ్డు వేసేదెప్పుడో..?

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి



బీటీరోడ్డు లేక కంకర తేలిన రాయికల్- రామాజీపేట మైతాపూర్ బ్రిడ్జి

రాయికల్: పట్టణం నుంచి రామాజీపేట, మైతాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో వంతెన నిర్మాణ పనులు కొనసా...గుతున్నాయి. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైతాపూర్ వంతెనకు రూ.2.91 కోట్లు రామాజీపేట వంతెన నిర్మాణం కోసం రూ.1.40 కోట్లు అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది.

పూర్తి కాని బీటీరోడ్డు నిర్మాణ పనులు..

ఈ రెండు వంతెనల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు నిర్మించిన వంతెనల పనులను కాంట్రాక్టర్ సైతం సకాలంలో పూర్తి చేయకపోవడంతో పాటు చేసిన పనుల్లో నాణ్యత లోపించడంతో సిమెంట్, కంకర తేలుతున్నాయి. గత వర్షాకాలంలో వర్షాల భయంతో కాంట్రాక్టర్ కేవలం వంతెన నిర్మాణ పనులు మాత్రమే పూర్తి చేశాడు. ఈ రెండు వంతెనలపై బీటీరోడ్డు నిర్మించాల్సి ఉండగా కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనుల ఊసే లేదు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ వంతెనపై ప్రయాణికులు రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి పైన సలాకలు తేలి నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి త్వరగా బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పట్టణ,మండల ప్రజలు కోరుతున్నారు.

వాహనాలు పాడవుతున్నాయి



రామాజీపేట, మైతాపూర్ బ్రిడ్జిలపై వాహనాలు వెళ్తుంటే పంచర్ అయ్యే పరిస్థితి నెలకొంది. బీటీరోడ్డు నిర్మాణం లేకపోవడంతో వంతెన నుంచి సలాకలు బయటకు వస్తున్నాయి. దీంతో తరుచూ వాహనాలు చెడిపోతున్నాయి. అధికారులు,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలి.

– రాంరెడ్డి, రాయికల్‌వాసి

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం



మండలంలోని మైతాపూర్, రామాజీపేట గ్రామాల్లో వంతెనలపై బీటీరోడ్డు నిర్మించేలా సంబంధిత కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నాం. త్వరలోనే బీటీరోడ్డు పనులు పూర్తయ్యేలా చూస్తాం. ప్రయాణికులు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం.

– మధు,ఏఈ, ఆర్అండ్‌బీ

యువత సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: యువత క్రీడలతోపాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కథలాపూర్ మండలం భూషణరావుపేటలో కేఎంపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నీని బుధవారం ఆయన ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. గ్రామాల్లోని యువత తీరిక వేళల్లో క్రీడలపై దృష్టిసారించాలని, సమస్యల పట్ల అవగాహన పెంచుకొని పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కథలాపూర్ మండలంలో క్రీడల నిర్వాహణకు అనువైన స్థలాన్ని సేకరించి మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెదలు సత్యనారాయణ, కాయితి నాగరాజు, తొట్ల అంజయ్య, గడ్డం భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి ఎమ్మెల్సీ మొక్కులు



మల్లికార్జున స్వామికి మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి గ్రామ శివారుల్లోని మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 16న ప్రారంభమైన జాతర ఉత్సవాలు నాగవెల్లి కార్యక్రమంతో ముగిశాయి. అటవీప్రాంతంలో ఉన్న ఈ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు బేతి పూర్ణచెందర్‌రెడ్డి, అప్పం స్వామి, బోగ గంగారాం, సూర ప్రభాకర్ రెడ్డి, గెంటె లచ్చయ్య, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పెగడపల్లి: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే అంగన్‌వాడీల లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర అన్నారు. మండలంలోని పలు అంగన్ వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి, బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి, పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు,గర్భిణులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ నిర్మాణం అందరి బాధ్యత

మల్యాల: గర్భిణులు, పిల్లలు పోషకాహారం తీసుకోని ఆరోగ్య సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పవిత్ర అన్నారు. మండలంలోని మానాలలో బుధవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పవిత్ర, తల్లులు, గర్భిణులకు ఆరోగ్య సంరక్షణలో, పిల్లల ఎదుగుదలలో పోషకాహారం పాత్రపై వివరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రత్నకుమారి, గంగాభవాని, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయానికి భూమిపూజ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఉప్పరిపేట పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ దాసాంజనేయస్వామి ఆలయం నిర్మిస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీడీ కార్మికుల వేతనాలు పెంచాలి



వినతి పత్రం ఇస్తున్న బీడీ కార్మిక నేతలు

కోరుట్ల: బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ, తెలంగాణలో సుమారు 7 లక్షల మంది బీడి కార్మికులు ఉన్నారని వీరి రెండేళ్ల వేతన ఒప్పందం ఈ నెల మార్చి 31తో ముగుస్తుందన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేయి బీడిలకు రూ. 300 మూలవేతనం చెల్లించాలన్నారు. 1994 ఒప్పందం ప్రకారం వీడీఏ పాయింట్‌కు పది పైసలు ఉన్నందునా.. దాన్ని 20 పైసలకు పెంచాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులందరికీ పీఎఫ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘాల నాయకులు ముఖ్రం, రంగారెడ్డి, శ్రీనివాస్, కొక్కుల శాంత, అనసూయ, శంకర్, మల్లారెడ్డి, రవి, వెంకన్న, సాంబయ్య, నర్సయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

సారంగాపూర్: గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సారంగాపూర్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల రూరల్ మండం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి తన టిప్పర్‌లో బీర్‌పూర్ మండలం గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుకను తీసుకవస్తుండగా లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారుల్లో టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించి, డ్రైవర్ వినోద్, యజమాని మనోహర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బుగ్గారం: మండలంలోని వెల్గొండలో పేకాట ఆడుతున్న 6 గురు వ్యక్తులను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద రూ.2800 నగదు లభించిందని పేర్కొన్నారు.

36వ సారి రక్తదానం చేసిన రైతు



రక్తదానం చేస్తున్న మల్లేశం

రాయికల్: మండలంలోని రాజానగర్ గ్రామానికి చెందిన జిన్న మల్లేశం రక్తహీనతతో బాధపడుతుండగా, అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరముండటంతో బుధవారం ఆలూరు గ్రామానికి చెందిన కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు మెక్కొండ రాంరెడ్డి 36వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను డాక్టర్ మల్లారెడ్డి తదితరులు అభినందించారు.

న్యాయవాదులకు నల్ల కోటు నుంచి మినహాయింపు

జగిత్యాలజోన్: వేసవికాలం దృష్ట్యా కోర్టుల్లో న్యాయవాదులకు నల్ల కోటు నుంచి మినహాయింపు ఇస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టుల్లో తప్పనిసరిగా న్యాయవాదులు నల్ల కోటుతో పాటు తెల్లటి వస్త్రాన్ని ధరిస్తారు. అయితే, వేసవికాలంలో ఉక్కపోత, చెమటతో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ న్యాయవాదుల తరుపున తెలంగాణ హైకోర్టుకు వినతిపత్రం సమర్పించారు. ఆ మేరకు వివిధ కోర్టుల్లో విధుల్లో పాల్గొనే న్యాయవాదులు మార్చి నుంచి జూన్ వరకు నల్ల కోటుతో పాటు నల్ల గౌన్ ధరించాల్సిన అవసరం లేదంటూ ఆదేశాలు జారీ చేస్తుంది. ఈ సర్క్యులర్‌ను కింది కోర్టులు తప్పనిసరిగా పాటించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అవకాశాన్ని ఉపాధిగా మార్చుకుని..



ప్లాస్టిక్ గన్‌లు విక్రయిస్తున్న మహిళ

బుగ్గారం: ప్రస్తుతం అన్ని ప్రాంతాలలో కోతుల బెడద రోజురోజుకు తీవ్రతరమవుతోంది. అనేక ప్రాంతాలలో కోతుల దాడిలో ప్రజలు గాయాలబారిన పడడం, ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిని భయభ్రాంతులకు గురిచేసి దూరంగా తరమడానికి ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. ఈ అవకాశాన్నే ఉపాధిగా మార్చుకుని కొందరు వీధి వ్యాపారులు కోతులను భయపెట్టి దూరంగా తరమడానికి అధిక శబ్దం చేసే ప్లాస్టిక్ గన్‌లను తయారు చేసి విక్రయిస్తున్నారు. కోతులను తరమడానికి ఇవి బాగా పనిచేస్తుండడంతో జనం ఎగబడి కొంటున్నారు. ఒక్కోటి రూ.200 నుంచి 300 వరకు అమ్ముతూ పలువురు తాత్కాలిక ఉపాధి పొందుతున్నారు.

ఆధ్యాత్మికం

కల్యాణం.. కమనీయం



రాఘవపేటలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణం, జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు–సరోజన దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలతో తరలివచ్చి స్వామి వారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దావ వసంత, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అర్చకులు మాధవచార్యులు బృందం కల్యాణం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గంధం లక్ష్మణ్, నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ ఆలయ వార్షికోత్సవం



సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న టీచర్లు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ విగ్రహం ప్రతిష్ఠించి 12 ఏళ్లు పూర్తవుతున్నందున బుధవారం విగ్రహదాతలు ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహదాతలు చెట్లపెల్లి నరేందర్‌గౌడ్, రవీందర్ గౌడ్, దేవేందర్‌గౌడ్, సుకేందర్ గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఐడెంటి కార్డులను అందచేశారు. కార్యక్రమంలో పంతంగి వెంకటేశ్‌యాదవ్, పుప్పెం మహేందర్, లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహ స్వామి బ్రహోత్సవాలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి బ్రహోత్మవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

లక్ష్మీ గణేశ్ మందిరంలో పూర్ణాహుతి హోమం



పూర్ణాహుతి హోమంలో పాల్గొన్న భక్తులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని శ్రీ లక్ష్మి గణేశ్ ఆలయంలో పూర్ణాహుతి హోమం ఘనంగా నిర్వహించారు. హంపి విరూపాక్షి, విద్యారణ్య భారతీ స్వామి వారి ఆదేశానుసారం ప్రముఖ పౌరాణిక పండితులు నంబి వేణుగోపాలాచార్య కౌశిక, బ్రహ్మశ్రీ తిగుళ్ల విషుశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి హోమం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన హోమంలో యంత్ర స్థాపన, మూషిక మూర్తి స్థాపన, మూల మంత్ర హవనం, బలిహరణం, పూర్ణాహుతి, అవబృత స్నానం మంగళహారతి, మంత్ర పుష్పం, మహదాశీర్వచనం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోటగిరి శ్రవణ్‌కుమార్, జిల్లా ప్రభాకర్,మారుతిరావు, పల్లెర్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భారత్ రైస్ సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భారత్ రైస్ పథకం పట్టణంలోని బీముని దుబ్బలో బుధవారం ప్రారంభించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకు అందజేయాలని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని కౌన్సిలర్ పెండెం గణేశ్ అన్నారు. భారత్ రైస్ కిలో ధర రూ. 29 ఉంటుందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బెజ్జారపు చందు, జక్కుల ప్రవీణ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలాల సాయి చంద్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన మర్క చంద్రయ్య అనే నిరుపేద ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి పలువురు ఆర్థికసాయం బుధవారం అందించారు. అంబారిపేట సాదీ అసోసియేషన్ తరుపున రూ.10 వేలు, వల్లకొండ మనోజ్ రూ. 5 వేలు, మహేంద్ర యూత్ సభ్యులు రూ. 3 వేలు, విజేత యూత్ రూ. 2 వేలు ఆర్థికసాయం అందించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు

రాయికల్: రాయికల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి ఆస్పత్రిలో 95 మందికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు బుధవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 2 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోసారపు శ్రీకాంత్, కోశాధికారి గంట్యాల ప్రవీణ్ పాల్గొన్నారు.

మండల కమిటీపై సమాచారం లేదు

రాయికల్: మండల గౌడ సంఘం నూతన కమిటీపై మండలంలోని గౌడ సంఘం నాయకులకు సమాచారం ఇవ్వలేదని నాయకులకు ఆరోపించారు. బుధవారం వారు మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామాల్లో ఉన్న గౌడ సంఘ కమిటీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కమిటీ వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కమిటీని డిమాండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మహేందర్‌గౌడ్, నారాయణగౌడ్, చిన్న కిష్టయ్య, సురేశ్‌గౌడ్, ఆనందంగౌడ్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ రవీందర్‌కు నివాళి

రాయికల్: దివంగత సీనియర్ జర్నలిస్ట్ దాసరి రవీందర్ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, డాక్టర్ మోర సుజిత్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ అధినేత బోగ రవిప్రసాద్, కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

పెళ్లిలో భోజనాల విషయంలో గొడవ

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మకూర్‌లో బుధవారం జరిగిన ఓ పెళ్లిలో గొడవ జరిగినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వేములవాడకు చెందిన అబ్బాయికి, ఆత్మకూర్‌కు చెందిన అమ్మాయితో వివాహం ఏర్పాటు చేశారు. కాగా భోజనాల విషయంలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో పరస్పరం దాడులు చేసుకోగా, పలువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యాపారిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు

మెట్‌పల్లి: పట్టణంలోని మార్కెట్‌లో జ్యువెల్లరీ షాపు నిర్వహించే ఇల్లెందుల కృష్ణమాచారిపై బుధవారం దాడికి పాల్పడ్డ కోరుట్ల రాజు, చాకిలి వేణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై..

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వేంపేటలో పల్లి శేఖర్‌గౌడ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. రూ.4800 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.